కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99
CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ  సంపుటి :05  సంచిక :143  ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్  బుధవారం 23-09-2026  పేజీలు : 4  వెల : రూ. 3/-

## కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు.. దసరాకు ముందే పంపిణీ!

హైదరాబాద్, సెప్టెంబర్ 22: తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ



పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## నన్ను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి పునాది వేశారు: పవన్



అమరావతి: పిఠాపురంలో తనని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి పునాది వేశారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. పిఠాపురాన్ని దేశంలో నెంబర్ వన్ చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. పిఠాపురం నిండుగా..అభివృద్ధి పండుగ కార్యాక్రమంలో భాగంగా ఆర్ఆర్ బిహెచ్ఆర్ మైదానంలోజరిగిన జనసేన సభలో పవన్ ప్రసంగించారు. తన విజయానికి సపోర్ట్ చేసిన టిడిపి, బిజెపి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలపారు. తనని గెలిపించి బలమైన ప్రయాణానికి నాంది పలికారన్నారు. గెలుపు, ఓటమి గురించి తాను ఎప్పుడూ ఆలోచించలేదన్నారు. ఉప్పాడ తీర ప్రాంత సమస్య చాలా కీలకమైనదని, శాశ్వత పరిష్కారానికి రక్షణ గోడ నిర్మించేందుకు కేంద్ర అనుమతులు సాధించామని వివరించారు. రక్షణ గోడ నిర్మాణానికి వేగంగా పనులు జరుగుతున్నాయని తెలియజేశారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో భారీ విస్ఫోటనం!

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ మెడికల్ సైన్స్ ఇన్స్టిట్యూట్ (రిమ్స్) ఎన్సీయూఏ స్పెషల్ కేర్ వార్డులో అర్ధరాత్రి ఏసీ పేలి మంటలు చెలరేగడంతో ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటనలో 21 మంది తీవ్ర అస్వస్థతకు గురై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎన్ఎస్ యుఏ) వార్డులో అర్ధరాత్రి అకస్మాత్తుగా ఏసి భారీ శబ్దంతో పేలి దట్టమైన పొగలతో మంటలు చెలరేగాయి. వెంటనే ఆస్పత్రి సిబ్బంది, శిశువుల తల్లిదండ్రులు అరుపులు కేకలతో హాహకారాలు చేయడంతో పరిస్థితి గమనించిన సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేశారు.అంధకారంలో దట్టమైన పొగలు వ్యాపించగా చిన్నారులను బయటకు తీసేందుకు మార్గం లేక వార్డులోని అద్దాలు పగలగొట్టి తమ పిల్లలను బయటకు తీసుకొని బయట పరుగులు పెట్టారు. అప్పటికే వార్డులో ఊపిరాడక నాలుగు రోజులు నిండని ఓ పసికందు ఊపిరాడక మృత్యువాత పడింది. తీవ్ర అస్వస్థతకు గురై గాయాల పాలైన 8 మంది నవజాత శిశువులను నిజామాబాద్ మాత శిశు సంరక్షణ కేంద్రానికి తరలిస్తుండగా నిర్మల్ వద్ద ఒకరు, నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. మొత్తం 24 మంది నియో నాటికల్ ఇన్సెంటివ్ కేర్ వార్డులో చికిత్స పొందుతుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంది. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్ అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గాయాల పాలై అస్వస్థతకు లోనైన చిన్నారులను ప్రైవేటు ఆసుపత్రుల్లో చేర్పించి మెరుగైన చికిత్స అందేలా చర్యలు చేపట్టారు.

### ఆస్పత్రి నిర్లక్ష్యంపై జనాగ్రహం..!

ఆస్పత్రిలో ముక్కు పచ్చలారని ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదం నింపగా, రిమ్స్ ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం పెల్లుబికింది. అధికారులు, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే పేదల ప్రాణాలు గాలిలో



కలుస్తున్నాయని, కనీసం చిన్నపిల్లలకు భద్రత లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అర్ధరాత్రి ఘటన అనంతరం చిన్నారుల తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు భారీ ఎత్తున తరలివచ్చి రిమ్స్ డైరెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే అనిల్, మాజీ మంత్రి జోగు రామన్నఆరా!

రిమ్స్ ఆస్పత్రిలో పేలుడు దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు శిశువుల తల్లిదండ్రులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మున్సిపల్ చైర్ పర్సన్ అనూష, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ప్రమాదంపై ప్రిన్స్ డైరెక్టర్ ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఉన్నత స్థాయి విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని జోగు రామన్న, అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నర్కారు ఆస్పత్రులను గాలికి వదిలిందని, పేదల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు.

## కవిత సమరశంఖం...



హైదరాబాద్, సెప్టెంబర్ 22,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో కవిత సమర శంఖం పూరించారు. ఆదివారం కొడంగల్ వేదికగా జరిగిన పాంచ జన్య సంకల్ప సభలో కవిత ఓపెన్ గా మాట్లాడారు. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా తన అభిప్రాయాన్ని.. మొహమాటం లేకుండా చెప్పేశారు.నేను వాళ్ళు వదిలిన బాణం.. వీళ్ళు వదిన బాణం కాదు. అలాంటి తలకాయ లేని మాటలు మాట్లాడను. అలాంటి వారి కోసం నేను కొడంగల్ గడ్డమీద నుంచి చెబుతున్న. ఇప్పటికీ అధికారానికి.. విద్యకు దూరంగా ఉన్న మా బహుజనుల బాణాన్ని నేను. యువకుల యుద్ధ నినాదాన్ని నేను. వారికోసం మోడీతో కొట్లాడుతా. రేవంత్ రెడ్డితో కొట్లాడుతా. చివరికి కేసీఆర్ తో నైనా కొట్లాడుతా. తద్వారా తన మీద వస్తున్న విమర్శలకు ఈ స్థాయిలో కవిత సమాధానం చెప్పారు. అంతేకాదు తనమీద అవాకులు చవాకులు పేరుతున్న గులాబీ పార్టీ సోషల్ మీడియా.. ఆ పార్టీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులకు కవిత గట్టిగానే కౌంటర్ ఇచ్చారు.వాస్తవానికి కవిత పాంచ జన్య సభలో గట్టిగా మాట్లాడారు. ఒక రకంగా దీనిని ఎన్నికల సభ లాగా ఆమె చాలెంజ్ గా తీసుకొని ప్రసంగించారు.. ప్రారంభం నుంచి చివరి దాకా బహుజనుల విషయాలను ప్రస్తావించారు. తన తండ్రి పరిపాలన కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని. ముఖ్యంగా విద్య.. వైద్యం.. ఇతర వాటిల్లో వృద్ధి కనిపించలేదని కవిత క్లారిటీ ఇచ్చారు. విద్య.. వైద్యం వంటివి తమ ప్రథమ ప్రాధాన్యాలు అని కవిత క్లారిటీ ఇచ్చారు. అక్కడితోనే ఆగిపోలేదు.. ఇంకా చాలా విషయాలను కవిత ఈ సభలో చెప్పారు. తన తండ్రి పరిపాలన కాలంలో జరిగిన అవినీతిని.. అక్రమాలను.. తనను బయటికి పంపించిన విధానాన్ని ఆమె వివరించారు.ఇటీవల తన అత్తగారిల్లు అయిన నిజామాబాదులో పాంచ జన్య సభను నిర్వహించిన కవిత.. అక్కడ కన్నీళ్లు పెట్టుకున్నారు. సభలో మాట్లాడుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కొడంగల్ లో మాత్రం ధైర్యంగా మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆరోపణలు చేసిన ఆమె.. చివరికి తన తండ్రిని కూడా వదిలిపెట్టలేదు. అన్నిటికంటే ముఖ్యంగా గులాబీ పార్టీ సోషల్ మీడియాకు దిమ్మతిరిగిపోయేలాగా కవిత రిప్లై ఇచ్చింది. ఒక రకంగా దానిని స్లిపర్ షాట్ అని చెప్పవచ్చు. కొద్దిరోజులుగా గులాబీ పార్టీ సోషల్ మీడియా కవిత మీద వ్యక్తిగతంగా దాడి చేసే స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు కవిత ఏర్పాటుచేసిన సోషల్ మీడియా గ్రూపులలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ.. గులాబీ పార్టీ సోషల్ మీడియా ఆగడం లేదు. అందువల్లే కొడంగల్ సభ నుంచి కవిత గట్టిగా రిప్లై ఇచ్చారు. మరి దీనికి గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎలాంటి కౌంటర్ ఇస్తుందో చూడాలి.

## తెలంగాణలో భారీ వర్షాలు.. పలు జిల్లాలకు అలర్ట్



హైదరాబాద్, సెప్టెంబర్ 22: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం కారణంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. 8 జిల్లాలకు అతి భారీ, 20 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని తెలిపింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షం కురుస్తుందని పేర్కొంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, నల్గొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. హైదరాబాద్ మహానగరం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేసింది. విద్యుత్ స్తంభాలు వద్ద, చెట్ల కింద నిలబడ వద్దని సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని పేర్కొంది. భారీ వర్షాలు నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

## బహుళపక్ష భాగస్వామ్యంతోనే భవితకు భరోసా...

న్యూఢిల్లీ, ప్రపంచ వ్యవస్థ ప్రస్తుతం మునుపెన్నడూ లేని తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ వైషమ్యాలు, పెచ్చరిల్లుతున్న సంఘర్షణలు అంతర్జాతీయ సహకార స్ఫూర్తిని గొడ్డలిపెట్టులా దెబ్బతీస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి 81వ సర్వసభ్య సమావేశాల వేళ న్యూయార్క్‌లో జరిగిన 'పార్ట్నర్స్ ఫర్ మల్టీలేటరలిజం' (P4M) సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చేసిన ప్రసంగం వీటికి స్పష్టమైన సమాధానాన్నిచ్చింది.

సంస్కరణలతోనే పటిష్ఠ వ్యవస్థ: అంతర్జాతీయ సంస్థల్లో నిర్ణయాలు మరింత పారదర్శకంగా, సమ్మిళితంగా ఉండాల్సిన తరుణం ఆసన్నమైందని జైశంకర్ కుండబద్దలు కొట్టారు. కేవలం చర్చలకే పరిమితం కాకుండా 'సంస్కరించిన బహుళపక్ష విధానం' తెరపైకి రావాలని నొక్కిచెప్పారు. అంతర్జాతీయ నియమ నిబంధనలకు అందరూ కట్టుబడి ఉన్నప్పుడే విశ్వసనీయత దక్కుతుందని హెచ్చరించారు.

'4F' సంక్షోభాలకు చెక్: ఇంధనం , ఆహారం , ఎరువులు ఆర్థికం అనే '4F' సవాళ్లను విధికి వదిలేయలేమని ఆయన స్పష్టం చేశారు. సరఫరా గొలుసుల్లో ఆటంకాలు ఏర్పడకుండా చూసుకోవాలని, సరికొత్త సాంకేతికతల వినియోగానికి గట్టి నిబంధనావళి అవసరమని పిలుపునిచ్చారు.



V4 దేశాలతో చరిత్రాత్మక మైత్రి: యూరోపియన్ యూనియన్ నేతలతో ద్వైపాక్షిక అంశాలపై చర్చించిన జైశంకర్, సెంట్రల్ యూరప్‌కు చెందిన విసెగ్రాడ్ కూటమి (V4 -- పోలండ్, చెక్ రిపబ్లిక్, స్లొవేకియా, హంగేరీ) విదేశాంగ మంత్రులతో తొలిసారి సమావేశమయ్యారు. రక్షణ, సాంకేతిక రంగాల్లో సంబంధాలను పటిష్ఠం చేసుకునేందుకు వార్షిక వాణిజ్య వేదిక ఏర్పాటుకు నిర్ణయించామని, ఇది సరికొత్త చరిత్రాత్మక పరిణామమని ఆయన ప్రకటించారు.

## సీఎం రేవంత్ చేతకానితనం వల్లే ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదం

ఆదిలాబాద్ జిల్లా: ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు చిన్నారులు మృతిచెందడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో మరో 23 మంది చిన్నారులు గాయపడ్డారని, వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని రేవంత్ రెడ్డి పూర్తిగా విధ్వంసం చేశారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఈ సంఘటనకు ఆయనే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు జిల్లా స్థాయి బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారని తెలిపారు. అయినా మొద్దు నిద్ర వీడని రేవంత్ సర్కార్‌లో కనీస చలనం కనిపించలేదన్నారు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని ఆరోపించారు. కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని కేటీఆర్ ఆగ్రహించారు.ఆదిలాబాద్



రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను వెంటనే నిపుణులతో తనిఖీ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రేవంత్ సర్కార్ చేతకానితనం వల్ల పిల్లలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతి కుటుంబానికీ రూ. 25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున కేటీఆర్ డిమాండ్ చేశారు.

## 'వందేమాతరం' వివాదంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ..

న్యూఢిల్లీ,'వందేమాతరం' పూర్తి అధికారిక వెర్షన్‌లోని ఆరు చరణాలను ఆలపించడంపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం కీలక విచారణ జరిపింది.కర్ణాటక సంగీత విద్వాంసుడు టి.ఎం. కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందనను రెండు వారాల్లోగా తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు కోరింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. 'వందేమాతరం' దేశ జాతీయ గీతం అనే అంశంపై వివాదం లేదని ధర్మాసనం పేర్కొన్నప్పటికీ.. దాన్ని ఆలపించకపోతే క్రిమినల్ శిక్షలు విధించే నిబంధనలపై న్యాయపరమైన పరిశీలన అవసరమా అన్న అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని సూచించింది. 'జాతీయ గీతం' అంటే ఏమిటో నిర్ణయించే అధికారం తమకు లేదని స్పష్టం చేసింది.పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. మురళీధర్ వాదిస్తూ.. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను తప్పనిసరిగా ఆలపించాలనే విధానం, దానిని పాటించనప్పుడు శిక్షలకు అవకాశం కల్పించడం వంటి అంశాలను సవాలు



## సంపాదకీయం

బుధవారం 23-09-2026

# జెన్-జీలో తగ్గని బీజేపీ క్రేజ్ !

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల ఫలితాలు దేశవ్యాప్తంగా నవతరం యువత జెన్-జీ మనోగతంపై జరుగుతున్న ప్రచారాలకు తెరదించాయి. కేంద్రంలో బీజేపీ వరుసగా అధికారంలో ఉన్నందున .. ఉద్యోగాలు, నిరుద్యోగం, అగ్నివీర్ వంటి అంశాలను అడ్డంపెట్టుకుని జెన్-జీ ఓటర్లు బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి క్రమంగా దూరమవుతున్నారంటూ ఇండియా కూటమి, వామపక్ష వర్గాలు చేసిన ప్రచారాలు డీయూ వేదికగా తేలిపోయాయి. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో నాలుగు కీలక పోస్టులలో మూడింటిని ఏబీవీపీ ఏకపక్షంగా కైవసం చేసుకోవడం ద్వారా.. దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో నేటి తరం యువత ఇప్పటికీ బీజేపీ అనుబంధ సంస్థల వైపే అత్యంత బలంగా నిలబడుతోందని తేలిపోయింది. దేశ నలుమూలల నుంచి వివిధ నేపథ్యాలు, సంస్కృతులు, సామాజిక వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన దాదాపు లక్షన్నర మందికి పైగా విద్యార్థులు ప్రాతినిధ్యం వహించే మినీ ఇండియాలాంటి క్యాంపస్ ఢిల్లీ విశ్వవిద్యాలయం. అలాంటి చోట స్వచ్ఛందంగా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఏబీవీపీ అభ్యర్థులకు జైకొట్టారంటే.. యువ ఓటర్లు ఇప్పటికీ మోదీ మార్క్ జాతీయవాదం, స్థిరమైన అభివృద్ధి అజెండాకే పట్టం కడుతున్నారని రుజువవుతోంది. కేవలం భావోద్వేగ నినాదాలకే పరిమితం కాకుండా, లైబ్రరీ టైమింగ్స్ విస్తరణ, క్యాంపస్ స్పెషల్ మెట్రో ఫీడర్ బస్సులు, హాస్టల్ సదుపాయాలు, మహిళా భద్రత వంటి ప్రాక్టికల్ సమస్యలపై నిరంతరం పోరాడే ఏబీవీపీని విద్యార్థులు తమ గొంతుకగా ఎంచుకున్నారు. మరోవైపు ప్రతిపక్షాలు నిర్మించిన నెరేటివ్స్ క్యాంపస్‌లలో ఏమాత్రం పనిచేయలేదనడానికి ఈ ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యం. కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐతో పాటు వామపక్ష కూటమి విద్యార్థుల మధ్య ప్రవేశపెట్టిన యాంటీ-బీజేపీ సెంటిమెంట్ క్షేత్రస్థాయిలో పటాపంచలైంది. చివరికి ఆ వ్యతిరేకత కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలకే దారితీసి.. సొంత రెబల్ అభ్యర్థే రికార్డు మెజారిటీతో నెగ్గేలా చేసిందే తప్ప, వ్యవస్థీకృతంగా విద్యార్థులను ఆకట్టుకోవడంలో ప్రతిపక్షాలు ఘోరంగా బోల్తా పడ్డాయి. విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, క్యాంపస్‌లలో విశ్వసనీయత సంపాదించుకోవడంలో ఏబీవీపీ చేసిన రూట్ మార్చేలా చేయడంలో విపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఈ ఎన్నికల సరళిని విశ్లేషిస్తే నవతరం ఓటర్లు కేవలం ప్రతిపక్షాల విమర్శలను గుడ్డిగా నమ్మడం లేదని, ఎవరు క్షేత్రస్థాయిలో పక్కాగా డెలివర్ చేయగలరనే ఆచరణాత్మక ఆలోచనతోనే ఓటేస్తున్నారని స్పష్టమైంది. జెన్-జీ ఓటు బీజేపీ నుంచి చేజారిపోతోందన్నది కేవలం సోషల్ మీడియా బబుల్స్‌లో సాగే ఊహాగానం మాత్రమేనని, వాస్తవ ఎన్నికల బ్యాలెట్ వద్దకు వచ్చేసరికి బీజేపీ భావజాలానికి నవతరం యువత తిరుగులేని మద్దతు లభిస్తోందని ఈ డీయూఎస్‌యూ తీర్పు బలంగా చాటిచెప్పింది. ఇప్పటివరకు ప్రధానంగా ఏకపక్ష సందేశాలకే పరిమితమైన ప్రచార విధానానికి బదులుగా.. ఇకపై యువతతో ద్విముఖ సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతతో తమ పార్టీకి ఉన్న కమ్యూనికేషన్ లోటును జెన్-జీ ఉద్యమం స్పష్టంగా బయటపెట్టిందని బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత తరం బాధ్యతాయుతమైన సమాధానాలు కోరుతోందని వారు విశ్లేషిస్తున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా ఒక్కటే పరిష్కారం కాదని, వ్యవస్థలో సమూల మార్పులు అవసరమనే భావన యువతలో బలంగా ఉందని పార్టీ గుర్తించినట్లు తెలుస్తోందిఎక్స్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు జెన్-జీని సమర్థంగా చేరుకోవడంలో ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు ఈ వేదికలను మరింత సమర్థంగా వినియోగిస్తూ యువతను ఆకర్షిస్తున్నాయని బీజేపీ భావిస్తోంది. దీంతో సోషల్ మీడియా వ్యూహంలో మార్పులు తప్పనిసరి అయ్యాయని నేతలు చెబుతున్నారు. యువత ఎక్కువగా వినియోగించే ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, రెడ్డిట్ మాధ్యమాల్లో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ యోచిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా యువకులతో కూడిన సోషల్ మీడియా బృందాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఇలాంటి బృందాలు ఉంటే ప్రభుత్వ విధానాలు, పార్టీ సందేశాలను యువతకు వారి భాషలో, వారికి నచ్చే శైలిలో చేరవేయవచ్చని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. యువతతో సమర్థవంతంగా మాట్లాడాలంటే యువతే ప్రధాన పాత్ర పోషించాలని, పెద్దలు కూడా వారితో మాట్లాడేటప్పుడు వారి శైలిని అనుసరించాల్సి ఉంటుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. నరేంద్ర మోదీ వ్యవహరించిన తీరును పార్టీ ఉదాహరణగా చూపుతోంది. విద్యార్థుల ఆందోళనల సమయంలో ప్రధాని సెల్ఫీ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడం యువతను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయమని పార్టీ నేతలు చెబుతున్నారు. యువత ఎక్కువ యాక్టివ్‌గా ఉండే సమయాన్ని వారికి చేరువైన మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా వారితో మమేకమయ్యే ప్రయత్నం చేశారని పేర్కొంటున్నారు. అంతేకాకుండా, కేంద్ర మంత్రులు కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో మరింత చురుకుగా ఉండాలని, ప్రజలతో ఇంటరాక్టివ్‌గా వ్యవహరించాలని కేబినెట్ సమావేశంలో ప్రధాని సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో భారతదేశం వివిధ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే మోదీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల కలిగే ప్రయోజనాలను, చైనాతో పోలికలను, రాష్ట్రాల వారీగా లాభాలను వివరించారు. ఈ తరహా అంశాలను కేవలం గణాంకాల రూపంలో కాకుండా ఇన్‌స్టా రీల్స్, చిన్న వీడియోలు, (గ్రాఫిక్స్), ఫ్లకార్డుల ద్వారా సులభంగా అర్థమయ్యే విధంగా యువతకు చేరవేయాలని పార్టీ ఆలోచిస్తోంది. ప్రభుత్వ విజయాలను ఆకర్షణీయమైన రూపంలో ప్రజెంట్ చేయడం ద్వారా యువతను మరింతగా ఆకట్టుకోవచ్చని భావిస్తోంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో రీ-ఎగ్జామినేషన్ విజయవంతంగా నిర్వహించిన తర్వాత వివాదం తగ్గిపోతుందని భావించినప్పటికీ, అది జరగలేదని బీజేపీ నేతలు విశ్లేషిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ చర్యలను విద్యార్థులకు సమర్థవంతంగా వివరించలేకపోవడమేనని వారు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జెన్-జీతో నిరంతర, పారదర్శక, వేగవంతమైన కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని బీజేపీ కసరత్తు ప్రారంభించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రానున్న రాష్ట్ర ఎన్నికలతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ బీజేపీ పట్ల యువత

# భీకరంగా మారుతున్న ఇరాన్ యుద్ధం.. అమెరికా కీలక హెచ్చరిక



టెహ్రాన్:పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ ముదురుతున్న నేపథ్యంలో అమెరికా కీలక భద్రతా హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లొద్దని తన పౌరులను ఆదేశించింది. ఇప్పటికే ఇరాన్‌లో ఉన్న అమెరికన్లు వెంటనే దేశం విడిచి వెళ్లాలని సూచించింది. పరిస్థితులు వేగంగా మారే అవకాశం ఉందని.. విమాన సర్వీసులు రద్దు కావడం, గగనతలం మూసివేయడం, సరిహద్దుల్లో ఆంక్షలు విధించడం వంటి పరిణామాలు ఎదురుకావచ్చని హెచ్చరించింది.

సంక్లిష్టంగా ఇరాన్‌లో భద్రతా పరిస్థితులు

అమెరికా వర్చువల్ ఎంబసీ ఇన్ ఇరాన్ తాజాగా విడుదల చేసిన భద్రతా హెచ్చరికలో.. ఏ కారణంతోనూ ఇరాన్‌కు వెళ్లొద్దు. అక్కడున్న అమెరికా పౌరులు వెంటనే ఇరాన్ నుంచి బయటకు వచ్చేయాలిః అని స్పష్టం చేసింది. ఇరాన్‌లో భద్రతా పరిస్థితులు సంక్లిష్టంగా మారుతున్నాయని పేర్కొంది. విమానాశ్రయాలు, విమానయాన సంస్థలు, సరిహద్దు మార్గాలకు సంబంధించిన పరిణామాలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించింది. ఇతర దేశాలకు వెళ్లాలనుకునేవారు ఆయా దేశాల ప్రవేశ నిబంధనలను ముందుగానే తెలుసుకోవాలని తెలిపింది.

అమెరికన్లకు పలు సూచనలు

ఇరాన్‌లో ఉన్న అమెరికన్లు నిరసనలు, భారీ జనసమూహాలకు దూరంగా ఉండాలని అమెరికా సూచించింది. అమెరికాతో బహిరంగంగా అనుబంధం ఉన్న ప్రాంతాల్లో తక్కువ ప్రొఫైల్ పాటించాలని తెలిపింది. వైమానిక దాడులు జరిగితే కిటికీలు, అద్దాల తలుపులకు దూరంగా ఉండాలని.. కూలిన భవనాలు, శిథిలాల వద్దకు వెళ్లొద్దని హెచ్చరించింది. అత్యవసర పరిస్థితుల్లో దౌత్య అధికారులను సంప్రదించేందుకు ఃస్మార్ట్ ట్రావెలర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. పశ్చిమాసియాలో ప్రయాణించే లేదా ఆ ప్రాంతం మీదుగా వెళ్లే అమెరికన్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. విమాన సర్వీసులు, గగనతల మార్గాల్లో ఆకస్మిక మార్పులు, రద్దులు చోటుచేసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది.

హౌతీల దాడులతో మరింత ఉద్రిక్తత

అమెరికా-ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. ఇరాన్ మద్దతున్న హౌతీల కార్యకలాపాలను కూడా అమెరికా ప్రస్తావించింది. సౌదీ అరేబియాపై, ముఖ్యంగా పౌర విమానాశ్రయాలపై హౌతీలు దాడులకు పాల్పడ్డారని పేర్కొంది. ప్రస్తుత సైనిక ఘర్షణలు వేగంగా మరింత విస్తరించే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇరాన్‌కు మద్దతిచ్చే గ్రూపులు అమెరికా ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని అమెరికా తెలిపింది. మధ్యప్రాచ్యంతో పాటు ఇతర ప్రాంతాల్లో గతంలో అమెరికా దౌత్య కార్యాలయాలు, సంస్థలపై దాడులు జరిగిన విషయాన్ని గుర్తుచేసింది. అమెరికా వ్యాపార సంస్థలు, ఇతర సంస్థలు, అమెరికా ప్రయోజనాలపైనా ముప్పు ఉండొచ్చని పేర్కొంది.

సౌదీలోనూ ఆంక్షలు

ఇరాన్‌తో పాటు సౌదీ అరేబియాలో ఉన్న అమెరికన్లకు కూడా ఇటీవల భద్రతా సూచనలు జారీ అయ్యాయి. హౌతీల దాడుల నేపథ్యంలో తైఫ్, యన్బు ప్రాంతాలకు అమెరికా ప్రభుత్వ ఉద్యోగులు అధికారిక లేదా వ్యక్తిగత ప్రయాణాలు చేయాలంటే ప్రత్యేక అనుమతి తీసుకోవాలని సూచించింది. మరోవైపు రియాద్ వైపు బాలిస్టిక్ క్షిపణి దూసుకురావడంతో సౌదీ అధికారులు అత్యవసర హెచ్చరిక జారీ చేశారు. ఆ క్షిపణిని అడ్డుకున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు తెలిపాయి. బిష్, తైఫ్, ఫరాసాన్, యన్బు ప్రాంతాల్లో పౌరులు, మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రయత్నాలు జరిగినట్లు పేర్కొన్నాయి. హౌతీల దాడులను ఖతార్ ఖండిస్తూ సౌదీ అరేబియాకు సంఘీభావం ప్రకటించింది.

అంతర్జాతీయ విమాన సర్వీసులపై ప్రభావం

ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ అంతర్జాతీయ రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. భద్రతా పరిస్థితులు, గగనతల పరిమితులు, విమాన మార్గాల్లో మార్పుల కారణంగా పలు అంతర్జాతీయ సర్వీసులు రద్దు లేదా నిలిపివేతకు గురయ్యాయి. అయితే గల్ఫ్ ప్రాంతంలోని అన్ని విమాన మార్గాలు పూర్తిగా మూసుకుపోలేదు. కొన్ని రూట్లలో సర్వీసులు కొనసాగుతున్నప్పటికీ.. పరిస్థితులను బట్టి విమానయాన సంస్థలు షెడ్యూళ్లలో మార్పులు చేస్తున్నాయి. తాజాగా ఇరాన్ నుంచి బయలుదేరే అంతర్జాతీయ విమానాల్లో దాదాపు మూడో వంతు రద్దైనట్లు సమాచారం. మాహాన్ ఎయిర్ కూడా ఇస్తాంబుల్, అంకారా, మస్కట్ వంటి అంతర్జాతీయ మార్గాల్లో సర్వీసులను నిలిపివేసింది. దీంతో ఇరాన్‌కు వెళ్లడం, అక్కడి నుంచి బయటకు రావడం గతంతో పోలిస్తే మరింత కష్టంగా మారింది.

దౌత్య మార్గాలు మాత్రం పూర్తిగా మూసుకుపోలేదు

అమెరికా-ఇరాన్ మధ్య దౌత్య సంబంధాలు తీవ్ర ఉద్రిక్తతలో ఉన్నప్పటికీ.. చర్చలకు సంబంధించిన మార్గాలు పూర్తిగా మూసుకుపోలేదు. సెప్టెంబర్ 20న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో సమావేశానికి తాను సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చారు. పెజెష్కియాన్ ఐక్యరాజ్యసమితి సాధారణ సభకు హాజరయ్యే సమయంలో ఈ భేటీకి అవకాశం ఉండొచ్చన్న సంకేతాలు వెలువడ్డాయి. మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కూడా ఐరాస సాధారణ సభకు వెళ్లే కార్యక్రమంలో భాగంగా దౌత్య ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. చైనా సైతం ఇరాన్, అమెరికా సంయమనం పాటించి జూన్‌లో కుదిరిన శాంతి ఒప్పందానికి తిరిగి రావాలని కోరుతోంది. దీంతో ఒకవైపు సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతుండగా.. మరోవైపు పరోక్ష దౌత్య ప్రయత్నాలు కూడా ఏకకాలంలో సాగుతున్నాయి.

## శ్రీశైలం ఘాట్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

శ్రీశైలం, ఉదయం శ్రీశైలం ఘాట్ రెడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆక్టోపస్ వ్యూ పాయింట్ వద్ద ఎదురుగా వస్తున్న బుల్లెట్ బైక్ను క్రూజర్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యూపీకి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. పలువురికి గాయాల్యాయి. గాయాలపాలైన వారిని అచ్చంపేట ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

# కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా



తిరుమల,తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు. అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్రే. ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రిఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది. మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిది. ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది. కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కదూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమిషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమిషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది.

చైర్మన్ పీఏ ? చైర్మన్ చెప్పకుండా చేయగలడా?

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక చైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్‌ఏ చట్టం కింద మనీ ట్రయల్ ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమిషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం. అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.

# అన్నీ పార్టీలకు సవాలే...

హైదరాబాద్, దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి అనివార్యంగా మారే ఉపఎన్నిక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు కొత్త ఊపిరి పోస్తుందా లేక మరిన్ని రాజకీయ సమస్యల్లోకి నెడుతుందా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పైకి చూస్తే అధికార కాంగ్రెస్‌పై పోరాడేందుకు ఇది ఒక సువర్ణావకాశంలా కనిపించినప్పటికీ, గ్రౌండ్ రియాలిటీ మాత్రం గులాబీ పార్టీకి పెను సవాలును విసురుతోంది. గతంలో పక్కనే ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణం తర్వాత వచ్చిన ఉపఎన్నికలోనూ సెంటిమెంట్, సానుభూతి ఏమాత్రం పనిచేయలేదు. హైదరాబాద్ మహానగర పరిధిలో గ్రామీణ ప్రాంతాల తరహా సాంప్రదాయ రాజకీయాలు, సానుభూతి పవనాలు పనిచేయవన్న విషయం ఆ చేదు ఫలితంతో బీఆర్ఎస్‌కు స్పష్టంగా అర్థమైంది. ఖైరతాబాద్ క్షేత్రస్థాయి సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే ఇక్కడ సంస్థాగతంగా బీఆర్ఎస్ బలం దాదాపు శూన్యమనే చెప్పాలి. గత దశాబ్ద కాలంగా అక్కడ రాజకీయం మొత్తం దానం నాగేందర్ చుట్టూనే తిరిగింది తప్ప, పార్టీకంటూ ప్రత్యేక క్యాడర్ నిర్మాణం బలంగా జరగలేదు. దానంకు నియోజకవర్గంలో ఉన్న బలమైన వ్యక్తిగత అనుచరగణం, స్థానిక బస్తీల్లో ఆయనకున్న వ్యక్తిగత పట్టు కాదనలేని వాస్తవం. దీనికి తోడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్‌లో సంప్రదాయబద్ధంగా ఉన్న పాత ఓటుబ్యాంకు, సంస్థాగత క్యాడర్ తోడవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన లోకల్ కేడర్, సరైన అభ్యర్థి లేని బీఆర్ఎస్‌కు దానం వ్యక్తిగత బలం, కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదుర్కొని నిలబడటం కత్తిమీద సామే అవుతుంది. ఒకవేళ ఈ ఉపఎన్నిక జరిగి, అధికార కాంగ్రెస్ పార్టీ దానం నాగేందర్‌ను నిలబెట్టి మళ్లీ గెలిపించుకుంటే.. అది బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తనకున్న పట్టు చేజారిపోయిందని, పార్టీ మారిన నేతను కూడా ఓడించలేకపోయామనే బలహీనమైన సంకేతం రాష్ట్రవ్యాప్తంగా వెళ్తుంది. ఇది జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో గులాబీ పార్టీ క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రత్యర్థి చేతిలో దెబ్బతిని నైతికంగా కుంగిపోవడం కంటే, ఇలాంటి ప్రతికూల సమయంలో ఉపఎన్నికలను ఎదుర్కోవడం పార్టీకి రాజకీయంగా పెద్ద రిస్క్ అనే చెప్పాలి. అందుకే ఈ ఖైరతాబాద్ ఉపఎన్నిక అటు బీఆర్ఎస్‌కు మాత్రమే కాదు, ఇటు అధికార కాంగ్రెస్‌కు కూడా ఒక అన్‌వాంటెడ్ తలనొప్పి లాంటిదే. అధికారంలో ఉండి ఒక్క ఉపఎన్నికలో కూడా తేడా రాకూడదనే ఒత్తిడి కాంగ్రెస్‌పై ఉంటే.. పరువు కాపాడుకోవాల్సిన డూ ఆర్ డై సిట్యువేషన్ బీఆర్ఎస్‌ను వెంటాడుతోంది. గెలిస్తే వచ్చే మైలేజీ కంటే, పొరపాటున ఓడిపోతే ఎదురయ్యే నష్టమే బీఆర్ఎస్‌కు పదిరెట్లు ఎక్కువగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతే. అయినా ఉపఎన్నికను రెండు పార్టీలు ఎదుర్కోక తప్పదు.

# సర్కార్ కు తలనొప్పిగా మారిన వివేకా కేసు

కడప, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చాలాకాలంగా చర్చనీయాంశంగా కొనసాగుతోంది. కేసు దర్యాప్తు, న్యాయపరమైన పరిణామాలు, కుటుంబ సభ్యుల మధ్య ఉన్న విభేదాలు రాజకీయ చర్చలకు కూడా కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వివేకా కుమార్తె వైఎస్ సునీత చేస్తున్న ప్రయత్నాలు మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తన తండ్రి హత్య కేసులో పూర్తిస్థాయి న్యాయం జరగలేదని సునీత చెబుతున్నారు. 2026 మార్చిలో ఆమె సీబీఐ దర్యాప్తుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దర్యాప్తు అన్ని కోణాల్లో జరగలేదని, కేసులో మరింత సమగ్ర విచారణ అవసరమని ఆమె పేర్కొన్నారు. తన తండ్రి హత్యకు సంబంధించిన వాస్తవాలు పూర్తిగా బయటకు రావాలంటే మరికొందరిని కూడా ప్రశ్నించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కేసులో సునీత గతంలో కూడా న్యాయపోరాటం కొనసాగించారు. నిందితులకు లభించిన బెయిల్‌ను సవాల్ చేయడంతో పాటు, మరింత దర్యాప్తు చేయాలని కోరుతూ ఆమె సుప్రీంకోర్టు ను ఆశ్రయించారు. అయితే 2026 మార్చిలో సుప్రీంకోర్టు ఆమె దాఖలు చేసిన సంబంధిత పిటిషన్లను కొట్టివేసింది. దీంతో కేసు తదుపరి న్యాయ ప్రక్రియపై దృష్టి నెలకొంది. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సునీత ఆరోపణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కేసు దర్యాప్తును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. సునీత చర్యలు రాజకీయంగా కొందరికి ఉపయోగపడుతున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇవి అవినాష్ రెడ్డి చేసిన ఆరోపణలేనని, వాటిని తుది వాస్తవాలుగా పరిగణించలేమని గుర్తించాలి. ఈ పరిణామాల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని ఎలా ఎదుర్కొంటుందన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో కనిపిస్తోంది. వివేకా కుమార్తె న్యాయం కోసం చేస్తున్న న్యాయపోరాటాన్ని రాజకీయ అంశంగా మార్చకుండా, కేసు కోర్టు పరిధిలోనే కొనసాగేందుకు ప్రాధాన్యం ఇవ్వాలా అనే ప్రశ్న కూడా ముందుకు వస్తోంది. అదే సమయంలో సునీతకు సంబంధించిన రాజకీయ సంబంధాలు, ఆమె చేసిన వ్యాఖ్యలను వివిధ పార్టీలు తమకు అనుకూలంగా విశ్లేషించుకోవడం కూడా జరుగుతోంది. ఈ కేసు ఇప్పటికే అనేక దర్యాప్తు దశలను దాటింది. 2026లో కూడా దీనిపై రాజకీయ, న్యాయపరమైన చర్చ కొనసాగుతోంది. అంతేకాకుండా ఆగస్టు 2026లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వివేకానందరెడ్డి హత్య కేసుతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ దర్యాప్తులో కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల సోదాలు నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి. అందువల్ల ఈ వ్యవహారంలో రాజకీయ వ్యాఖ్యలకు మించి కోర్టు ప్రక్రియ, దర్యాప్తు సంస్థల చర్యలు, అధికారిక రికార్డులు కీలకంగా మారనున్నాయి. వివేకా కుటుంబానికి న్యాయం జరిగిందనే భావన కలగాలంటే కేసులోని అంశాలు న్యాయపరమైన ప్రక్రియ ద్వారా స్పష్టతకు రావాల్సి ఉంటుంది.

## ప్రభుత్వ శాఖల అధికారులను వెంటనే నియమించాలి

రంపచోడవరం, పోలవరం జిల్లా ఆవిర్భవించి దాదాపు ఏడాది కావోస్తున్నా, జిల్లాకు పూర్తిస్థాయి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ)ని నియమించకపోవడం విచారకరమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుజ శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు కలెక్టర్‌ను నియమించిన ప్రభుత్వం, ఎస్పీ నియామకంపై నిర్లక్ష్యం వహించడం తగదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీనే పోలవరం జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండటంతో, శాంతిభద్రతల పర్యవేక్షణ తగ్గిపోతోందని శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన అనేక పోలీస్ స్టేషన్లలో బాధితుల ఫిర్యాదులపై తగిన చర్యలు లేక కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని, ప్రజలు నెలల తరబడి స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. జిల్లా ఎస్పీ అందుబాటులో ఉంటే, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంపై నేరుగా ఉన్నతాధికారికి విన్నవించుకునే అవకాశం బాధితులకు కలుగుతుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని సివిల్ వివాదాల్లో కూడా కొన్ని చోట్ల స్థానిక పోలీసులు అనవసర జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. కేవలం పోలీస్ శాఖ మాత్రమే కాకుండా, జిల్లాలోని పలు ముఖ్యమైన ప్రభుత్వ శాఖలు ఇప్పటికీ అల్లూరి జిల్లా నుంచే ఇన్‌చార్జ్ పాలన సాగిస్తున్నాయని వారు తెలిపారు. ఈ కారణం చేత ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఖఉఖీూ) మరియు కలెక్టరేట్‌లో దాఖలు చేసిన ఫిర్యాదులు సకాలంలో పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అంతేకాకుండా, ఉద్యోగుల నియామకాలు, బదిలీలు, పదోన్నతుల వ్యవహారాలు

